- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఎంసెట్, జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక తరగతులు
- కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ కాలేజీల్లో బోధన, సదుపాయాలు
- జిల్లావ్యాప్తంగా 9 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు
- గతేడాదితో పోలిస్తే కాలేజీల్లో పెరిగిన విద్యార్థులు
- అత్యధికంగా తాండూరు కాలేజీలో 1185 మంది విద్యార్థులు

# వంద శాతం.. టార్గెట్..



వికారాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. వెనుకబడిన విద్యార్థుల దత్తత, ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర కార్యక్రమాలను ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేపట్టారు. మరోవైపు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తుండడంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సకల వసతులు కల్పించడంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు పూర్వ వైభవం వచ్చింది.

కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీల్లో కంటే మంచి విద్యార్హతలు కలిగిన అధ్యాపకులు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉండడం, సొంత భవనాలు ఉండడం, ఉచిత విద్య, ఉచితంగా పుస్తకాలు తదితర వసతులు కల్పిస్తుండడంతో తిరిగి ప్రభుత్వ జూనియర్ కాలేజీల వైపు అడుగులు వేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు మాత్రం తరగతులు లేకున్నా పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తుండడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అధిక మొత్తంలో విద్యార్థులు చేరడం గమనార్హం. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సీసీ కెమెరాలతోపాటు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తుండడంతోపాటు డిజిటల్ విధానంలో బోధనను కూడా పలు కాలేజీల్లో ఇప్పటికే అమల్లోకి తీసుకువచ్చారు. జిల్లావ్యాప్తంగా 9 ప్రభుత్వ జూనియర్ కాలేజీలుండగా.. 4500 వేల మంది విద్యార్థులున్నారు. మరోవైపు దౌల్తాబాద్, బషీరాబాద్ మండలాలకు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు మంజూరుకాగా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.



## కొనసాగుతున్న రివిజన్ ప్రక్రియ

ఇంటర్మీడియట్ ఫలితాల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సిలబస్ పూర్తికాగా, రివిజన్ ప్రక్రియ కొనసాగుతున్నది. ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేస్తున్నారు. గతేడాది 60 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 80 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు చేపట్టారు. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలకు దీటుగా గత ఐదేండ్లుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. కాలేజీలు ప్రారంభమయ్యే ఆగస్టు నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉదయం గంట, సాయంత్రం గంటపాటు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి 9.45 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. మొదటి సంవత్సరంలో ఫెయిలైన విద్యార్థులతోపాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను లెక్చరర్లు దత్తత తీసుకొని మరీ మంచి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని ఏ సబ్జెక్టులో అయితే ఉత్తీర్ణత శాతం తక్కువ వస్తుందో సంబంధిత లెక్చరర్లపై చర్యలు తీసుకుంటామని కూడా సంబంధిత ఉన్నతాధికారులు హెచ్చరిస్తుండడంతో ప్రతి కాలేజీలో ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు చేపడుతున్నారు. మేధోవంతులైన అధ్యాపకులు ఉండడంతో పలు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం ప్రైవేట్ కాలేజీల కంటే అదనంగా సర్కార్ జూనియర్ కాలేజీల విద్యార్థులు సాధిస్తున్నారు. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా కాలేజీల్లో చేర్చుకోవడం, ఉచితంగా అన్ని కోర్సులకు సంబంధించిన పుస్తకాలను అందజేయడం, ప్రాక్టికల్స్‌కు సంబంధించి ల్యాబ్ మెటీరియల్ అందజేయడం, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానంతో రోజురోజుకూ విద్యార్థుల శాతం పెరుగుతున్నది. సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని అమలుచేస్తుండడంతో అధ్యాపకులు, విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు.

### అందరూ ఉత్తీర్ణత సాధించేలా చర్యలు

ప్రైవేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సకల సదుపాయాలతోపాటు మంచి విద్యార్హతగల అధ్యాపకులతో బోధన జరుగుతున్నది. ఈ విద్యా సంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాం. ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షలకు కూడా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే సిలబస్ పూర్తయింది. సంక్రాంతి తర్వాత ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో రెండో ప్రీ ఫైనల్ పరీక్షలను కూడా నిర్వహించి ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యేలా చర్యలు చేపట్టాం.

**- శంకర్‌నాయక్, ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి**

## ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్ష తరగతులు

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్హతలు కలిగిన అధ్యాపకులతో బోధనతోపాటు ఇంటర్ అనంతరం ఇంజినీరింగ్, మెడికల్‌కు సంబంధించిన ప్రవేశ పరీక్షలకు కూడా ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రైవేట్ కాలేజీలకు దీటుగా ఎంసెట్, జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్, నీట్ ప్రవేశ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ గంటసేపు ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేకంగా తరగతులను నిర్వహిస్తున్నారు. ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులను సిద్ధం చేస్తుండడంతో గతేడాది జరిగిన ఎంసెట్ ప్రవేశ పరీక్షల్లో జిల్లాలోని ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు సత్తా చాటారు. ఏకంగా జిల్లా ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులు 30 ర్యాంకులు సాధించడం గమనార్హం.

---

మానవళికి పత్రీజీ చేసిన మహోపకారమే

# 'శ్వాస మీద ధ్యాస'

- ప్రముఖ నటుడు, గేయ రచయిత తనికెళ్ల భరణి
- ధ్యాన మహాయాగంలో పాల్గొన్న ధ్యాన గురువులు
- పిరమిడ్ ఆవరణలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- వరుస సెలవులతో కిక్కిరిసిన పిరమిడ్ ప్రాంగణం



యాగంలో పాల్గొన్న ధ్యానులనుద్దేశించి మాట్లాడుతున్న తనికెళ్ల భరణి

కడ్తాల్, డిసెంబర్ 25 : మానవళికి ధ్యాన గురువు సుభాశ్ పత్రీజీ చేసిన మహోపకారమే 'శ్వాస మీద ధ్యాస' అని, నిత్య ధ్యాన సాధనతో మానసిక ప్రశాంతాత లభిస్తుందని ప్రముఖ నటుడు, గేయ రచయిత తనికెళ్ల భరణి, ది ఇండియన్ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ వ్యవస్థాపక సభ్యురాలు స్వర్ణమాల పత్రీ, క్రైస్తవ మత ప్రచారకుడు అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో, పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న సుభాశ్ పత్రీజీ ధ్యాన మహాయాగం-2 ఐదో రోజుకు చేరుకుంది. సోమవారం సెలవు దినంతోపాటు క్రిస్మస్ పండుగ సందర్భంగా మహాయాగానికి ధ్యానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ధ్యానులు పత్రీజీ శక్తిస్థల్‌ను సందర్శించి ధ్యానంతో నివాళులర్పించారు. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ప్రాఃతకాల ధ్యానంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ఆధ్యాత్మిక గురువులు, పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు పాల్గొన్నారు.

తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. ధ్యానానికి కుల, మత భేదం లేదని, ప్రతి ఒక్కరూ ధ్యాన సాధన చేయవచ్చని తెలిపారు. 30 ఏండ్ల క్రితం పత్రీజీ నాటిన ధ్యాన విత్తనం.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వట వృక్షంవలే విస్తరించిందని పేర్కొన్నారు. నిస్వార్థంగా పత్రీజీ చేసిన సేవ చాలా గొప్పదన్నారు. పత్రీజీతో తనకున్న సాన్నిహిత్యాన్ని ఆయన నెమరవేసుకున్నారు. అనంతరం ఆయన 'నాలోన శివుడు గలడు' అనే పాటను ఆలపించి ధ్యానుల్ని రంజింపచేశారు.

పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రీ మాట్లాడుతూ.. మనలోని సంకల్పానికి ధ్యానంతో తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చని తెలిపారు. సుభాష్ పత్రీజీ సాముహిక సంగీత, ప్రకృతి, పౌర్ణమి, పిరమిడ్ ధ్యానాలను అందించారని పేర్కొన్నారు. దేవుడి రాజ్యం నీ లోపల ఉందని, రెండు కండ్లు ఒక్కటైతే తప్ప దేవుని రాజ్యంలోకి ప్రవేశించలేమని జీసెస్ ప్రబోధించారని తెలిపారు. జీసెస్ అంటేనే ప్రేమ, కరుణ, త్యాగమని పేర్కొన్నారు. ఎదుటి వారితో ఆత్మీయంగా మెలగాలన్నారు. ఈ సందర్భంగా పిరమిడ్ సభా వేదికపై క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'పత్రీజీ శక్తిస్థల్-స్టాచ్యూ ఆఫ్ మెడిటేషన్ ఫర్ వన్ నెస్' నిర్మాణానికి ధ్యానులు సహకరించాలని కోరారు. అనంతరం పత్రీజీ స్టాచ్యు, డైరీలు, క్యాలెండర్లు, ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిరమిడ్ ప్రధాన వేదికపై జానపద పాటలు, కళాకారుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



ధ్యాన మహాయాగంలో నృత్యం చేస్తున్న యువతులు

కార్యక్రమంలో పత్రీజీ కుమార్తె పరిణిత పత్రీ, సభ్యులు బాలకృష్ణ, సాంబ శివరావు, శ్రీరాంగోపాల్, రాంబాబు, హన్మంతు రాజు, శివప్రసాద్, దామోదర్‌రెడ్డి, మాధవి, లక్ష్మి, జయశ్రీ పాల్గొన్నారు.


---

చెరువులోకి దూసుకెళ్లిన కారు

# ఒకరు మృతి

- క్షేమంగా బయటపడ్డ నలుగురు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 25 : కారు అదుపు తప్పి శివారెడ్డిపేట చెరువులోకి దూసుకెళ్లిన సంఘటన వికారాబాద్ పట్టణంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఐదుగురు పర్యాటకులు సాగర్, రఘు, గుణశేఖర్(24), పూజిత, మోహన్ కారులో తెల్లవారుజామున వికారాబాద్ అనంతగిరి హిల్స్‌కు వస్తున్నారు. వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేట చెరువు వద్ద అదుపుతప్పి ఉదయం 5 గంటల సమయంలో కారు చెరువులోకి దూసుకుపోయింది. గమనించిన స్థానికులు 100, 108కి సమాచారం అందజేశారు. కారు నీటిలో మునిగిపోవడంతో నలుగురు బయటపడగా వారిని పట్టణంలోని ఓ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గుణశేఖర్ అనే యువకుడు చెరువులో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో చెరువులో పడ్డ కారును బయటకు తీశారు. గజ ఈతగాళ్లతో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చెరువు పరిసరాలను పరిశీలించారు. సహాయ చర్యలు వేగవంతం చేయాలని పోలీసులకు సూచించారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం వికారాబాద్ సీఐ ఆధ్వర్యంలో రెస్క్యూటీంతో ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టగా 11 గంటల తరువాత గుణశేఖర్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ఐదుగురు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారని.. వీరందరూ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నారని, కారును మోహన్ అనే వ్యక్తి నడిపినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై విచారణ కొనసాగుతున్నదని, పూర్తి విచారణ తరువాత వివరాలు తెలుస్తాయన్నారు. సంఘటనా స్థలానికి వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వికారాబాద్ సీఐ శ్రీను, ఎస్సై అన్వేశ్‌రెడ్డి, పోలీసులు, నాయకులు, ప్రజలు తరలివచ్చారు.



సంఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి (ఇన్‌సెట్లో) మృతుడు గుణశేఖర్